


# రక్తశోక

మండువేసవి. మిట్టమధ్యాహ్నం.

వేడిగాడ్పులవల్ల కాబోలు నిర్మానుష్యమైన రోడ్లు, ఆకలితో దాహంతో అంగలార్చే కుక్కలు, వికారంగా అరిచే కాకులు, చిల్లర డబ్బులుంటే చాలు దాహం తీరుస్తామన్నట్లు 'నిమ్మకాయ షోడా' కేకలు.

వీటన్నిటితోనూ నా కేమీ సంబంధం లేనట్లు ఊరిచివర ఒక చిన్న పూరింట్లో బయల్దేరి, సాధ్యమైనంత దూరం సాగిపోవాలని ప్రయత్నిస్తూందో పాట. సంగీత శాస్త్రాల కింద తర్ఫీదు పొందక పోయినా, సన్నని కంఠం కావటం మూలాన శ్రావ్యంగానూ, సహజంగానూ ఉంది.

మట్టిగోడలు, పూరిల్లు అయినా ఉన్న ఒక్క గది శుభ్రంగా అలుక్కబడి ఉంది. ద్వారానికి అడ్డంగా 'కర్టెన్' వేలాడుతూంది. ఆ గదికి కిటికీలంటూ వేరే లేకపోవటం మూలాన మనుషులతోపాటు వెలుగుకూడా ఈ ద్వారం గుండానే రావాలి. ద్వారానికి కొంచెం దూరంలోనే ఉన్నాయి ఒక పాత కుట్టుమిషను, కింద చిరుగుల చాపమీద వాల్చివున్న వెడల్పు బల్లమీద చిందరవందరగా పడివున్న కత్తెర, కత్తిరించిన గుడ్డలు, పక్కనే చేంతాడుతో కట్టిన దణ్ణంమీద పొందిగ్గా వేలాడే తయారైన దుస్తులు, రవికలు, జాకీలు, చిన్నగౌన్లు.

కుట్టుమిషన్‌కి కొద్ది దూరంలో నులకమంచం మీద కూర్చుని ఊయల ఊపుతూ పాడుతూంది నాగమణి. పాటను ప్రసారంచేసే సాధనాలుగా పెదవులు

కదలాడుతూంటే, చేతికి వేసుకున్న మట్టిగాజులు చేసే చిట్టిచప్పుళ్ళు, దూలానికి ఒరుసుకుని ఊయలతాళ్ళు తీసే రాగాలు, చిన్నిపాప తీసి విడిచే ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లయబద్ధంగా తాళం వేస్తున్నట్లుంది. అయినా ఆమె మనస్సు మాత్రం అటు పాటమీదా లేదు, ఇటు ఉయ్యాలలో ఉన్న పాపమీదా లేదు. కలగంటున్నట్లు ఎదురుగా ఉన్న గోడను చూస్తున్నా యామె కళ్ళు. ఆ గోడకూడా బోసిగానే ఉంది, ఒక చిన్న ఫోటో తప్ప.

పాపాయి నిద్రపోయినా ఆమె పాట ఆపలేదు. నోరు పాడుకుపోతూంది గాని, ఆమె మనస్సు ఏవో సమస్యల్ని పరిష్కరించేందుకు దారులు, తెన్నులు వెతుకుతూంది.

రోజా పట్టించుకోకపోయినా, ఈ రోజు నాలుగేళ్ళ నాటి ఒక తారీఖు ఆమెకు జ్ఞాపకం వస్తూంది. ఈ రోజు తారీఖుకూడా అదే!

గోడమీద ఉన్న ఫోటోవంకే తదేకంగా చూస్తూంది దామె. నొక్కునొక్కుల జుట్టు, చురుకైన కళ్ళు, పెదవులమీద అమాయికంగా కనిపించే నవ్వు! ఆ రూపం చూడ ముచ్చటగా ఉంది.

ఆ ఫోటోకి అలంకరించిన మల్లెపూలదండ తన ధవళత్వాన్ని పోగొట్టుకుని లేత జేగురురంగులోకి దిగింది. అగరువత్తులు కాలిపోయి ఒకప్పుడు తామున్న జాడలు మాత్రం వదిలాయి అద్దంమీద.

బయట గుమ్మం దగ్గిర ఎవరో వచ్చిన అలికిడి అయింది.

పదమూడేళ్ల అమ్మాయి లోనికి రావడానికి అభ్యంతరమేదో ఉన్నట్లు అక్కడే నిలబడి పిలిచింది, "అమ్మగారూ!" అని. ఆమె కుడిచేతితో మడిచిన వాయిలుగుడ్డ పట్టుకుని, రెండవ చేతితో జడ ముందుకు వేసుకుని సరిచూసుకుంటూంది. వేషం మాత్రం కలవారి పిల్లలానే కనిపిస్తూంది.

"రా, కాంతం! రా!"

నాగమణి ఆ మాట అనడమే తడవుగా ఆ అమ్మాయి లోపలికి వచ్చింది.

"వస్తూ ఉంటే దారిలో సీతమ్మగారు కనిపించి ఇది మీ కిమ్మన్నారండీ!" అంటూ అయిదు రూపాయల నోటు ఆమె కందించింది.

పాపకి పాలడబ్బా కొనాలని ఈ డబ్బు కోసమే సీతమ్మగారింటికి వెళ్లింది ఉదయం. ఆమె ఇంట్లో లేకపోవడంతో వెనక్కి తిరిగి వచ్చేసింది. ఏమయినా ఆ సమస్య మాత్రం తీరిందని సంతోషించింది నాగమణి.

చిన్నస్టేషన్లలో ఆగకుండా పరిగెత్తే ఎక్స్‌ప్రెస్ బండిలా చెప్పుకుపోతూంది కాంతం. "పిల్లల జీతాల డబ్బు రేపు పంపుతానని చెప్పమన్నారండి సీతమ్మగారు. అన్నట్లు, నాకు కత్తిరింపు వచ్చేసినట్లేగా! ఇక మిషన్ వెయ్యమంటారా? మా గోపీగాడు రోజూ మారాం పెడుతున్నాడు ఒక లాల్చీ కుట్టి ఇవ్వమని. పెట్టెడు బట్టలున్నా వాడెప్పుడు అంతేనండీ! ఇదుగో! ఇది చూశారా? ఈ వాయిలుగుడ్డ అందుకే తీసుకొచ్చానండీ! బాగుందంటారా? ఎలాగయినా ఇదివాళ కత్తిరించి కుట్టెయ్యాల్సిందే!"

నాగమణి చిన్నగా నవ్వింది. "చేతికుట్టే నీ కిష్ట మన్నావు కదూ!"

"లేదండీ! మిషన్‌మీదయితే గబగబా ఎంచక్కా

తుమ్మెద కనిపించగానే మకరంద మాధుర్యంతో మత్తెక్కిన పూవు పిలుస్తుంది. తనలో వలపులు రేపి, తలపులు పండించిన మగవాని జ్ఞాపకాలు వయసులో ఉన్న వనితను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఒకసారి హృదయాలు పంచుకుని, సుఖాలతో నింపుకున్నవారు బాహ్య బంధాలు తెంచుకున్నా, మమతా బంధాలను తెంచుకోలేరు. మధుర స్మృతులకు మనుషు లెప్పుడూ బందీలే.

కుట్టెయ్యవచ్చు. అదీగాక కుట్టు బాగా వస్తే మిషన్ కొనిస్తానంది మా అమ్మ!"

బుజ్జగిస్తున్నట్లు కాంతం భుజం తట్టింది నాగమణి. "నా ఒంట్లో నిన్న రాత్రినించి ఏమీ బాగాలేదు. ఇప్పుడు అలాగే ఉంది. ఇవాల్టికేమి అనుకోకు. రేపటినించి మామూలుగానే ఉంటుంది."

'ఇన్నాళ్లయి ఒక్కనాడన్నా ఒంట్లో బాగాలేదనే మాటే లేదు. నిజంగానే ఆమె ఒంట్లో బాగోలేదేమో!' అనుకుంటూనే, "జ్వరం వచ్చిందా అండీ!" అని అడిగింది కాంతం.

"గుండె బరువుగా అదోలా ఉందమ్మా! నువ్వలా వెళ్లేటప్పుడు సరుసుకి, శశికి చెబుతావు కదూ?" మనసు బాగాలేదని చెప్పటానికి ఇష్టంలేక అలాఅంది నాగమణి.

గుమ్మంవరకూ వెళ్లిన పిల్ల కాస్త ఏదో జ్ఞాపకం వచ్చినట్లయి వెనక్కి తిరిగివచ్చింది. "అన్నట్లు, మొన్ననే ననుకుంటా—సాయంత్రం—మా ఇంటిముందు నుంచి కృష్ణారావు మాస్టారు వెళుతూ పలకరించారండీ!. . ."

ఆ పేరు వినగానే నాగమణి ఉలిక్కిపడింది. రక్తం ఒక్కసారిగా ఆమె ముఖంలోకి చిమ్మకు వచ్చింది. ఏమిటన్నారో అడుగుదామనుకుంది. కాని వెంటనే సంబాళించుకొని తల వంచుకుంది. చూపులు సందు చేసుకుని వాడిపోయిన పూలచెండు మధ్యనున్న ఫోటోలోని రూపాన్ని తడిమి చూసుకున్నాయి. 'ఎంత ఆకర్షణ ఆ కళ్లల్లో!' అనుకుంది. ఆ ఆకర్షణ నుండి తప్పించుకునేందుకు చూపులు మరల్చుకుంది నాగమణి. తుమ్మెద కనిపించగానే రమ్మని పిలిచే పువ్వులా, అయన పేరు వినగానే ఎందుకు తన మనసు అలా వికసించుకుంటుందో అర్థం కాలే దామెకు.

"ఆయనేమన్నారో తెలుసాండీ? 'మీ మాస్టరమ్మ బాగా పాఠాలు నేర్పుతూందా? నేర్చుకో! బాగా నేర్చుకో! బాగుపడాలంటే అటువంటివి నేర్చుకోవాలి మరి!' ఏమండీ? ఆయనకి ఒంట్లో బాగుండటం లేదా? బాగా నీరసంగా ఉన్నారండీ!. . ." నాగమణి ముఖంలో మార్పులేవీ ఆ పిల్లకు అర్థంకాలేదు గాని, ఒక్కటి మాత్రం తెలుసు, కృష్ణారావుగారు ఆవిణ్ణి

**యం. ఆర్. లక్ష్మి**

పెళ్లాడినా, ఆవిడంటే పడదని! ఆ పిల్లకు తెలిసినంత వరకు ఒక్కనాడైనా ఆయనిక్కడికి రాలేదు, తనిక్కడ మిషన్ నేర్చుకోటానికి వచ్చినప్పటినించీ!

నాగమణి ముఖం చిన్నది చేసుకుని పక్కకు తిప్పుకుంది. ఆమె కన్నులు కోపంతో బరువెక్కాయి. దుఃఖం గొంతుదాకా వచ్చింది. ఆ పిల్లముందు ఆవేశాన్ని, దుఃఖాన్ని ఆపుకునేందుకు తన శక్తినంతా వినియోగించవలసి వచ్చింది. "సరేగాని, ఎండలో వచ్చినట్లున్నావు, మంచినీళ్లేమైనా కావాలా?"

"వద్దండీ! వెళతాను. రేపు ఈ వేళకే రమ్మంటారా? పోనీ, మీకు ఒంట్లో బాగుండకపోతే. . ."

"అదేం లేదు. రేపు తప్పకుండా రా! వెళ్లేప్పుడు వాళ్లతోకూడా చెప్పి వెళతావు కదూ!"

అలాగే అన్నట్లు తల ఆడించి మెల్లిగా వెళ్లిపోయిందా పిల్ల.

ఆ పిల్ల వెళ్లగానే వెలిగక్కుదామనుకున్న దుఃఖం వింతగా మాయమైంది. ఇందాకటి కోపరేఖలుకూడా ఎటు పోయాయో తెలియలేదు. కోపానికి, దుఃఖానికి బదులు ఆమె మనస్సేవో వంకర టింకర దారులలో అగమ్యంగా, అతివేగంగా పరుగులు తీస్తూంది! ఫోటోలోని ముఖం ఆ ఆలోచనల్లోంచి తొంగి చూస్తూం దామె గుండెల్లోకి.

నాలుగేళ్ల కిందటి ఈ రోజు! ఎందుకు గుర్తు తెచ్చుకోవాలా రోజు? గడిచిన కాలంలా గాలిలో కలిసి, ఎక్కడికో రెక్కలు కట్టుకుపోయిన ఆ పాతస్మృతులు తలపుకు తెచ్చుకుంటే ఏమిటి లాభం?

అయినా పిచ్చికదూ? ఎందుకు తనివాళ ఫోటో చుట్టూ హారం వెయ్యాలి? ఉదయాన్నే కావాలంటే దొరకవని నిన్ననే కొని భద్రం చేసి ఈ రోజు అలంకరించవలసిన అవసరం ఏమిటి? ఎందుకు తన కంత శ్రద్ధ? పైగా. అగరువత్తులు వెలిగించి ఆదరించవలసిన ఆగత్యం ఏమిటి? అసలు ఆ ఫోటో అయినా ఎందుకుండాలీ ఇంట్లో? ఈ ఇంటితోగాని, తనతో గాని సంబంధం తెగతెంపులు చేసుకున్న మనిషంటే తన కెందుకీ విశ్వాసం, గౌరవం, అభిమానం?

నాలుగేళ్ల కిందటి ఈ రోజే కదూ తన నీ స్థితికి తెచ్చింది? ఒక్క సంవత్సరం కాబోలు తీయని తలపులు, అనుభూతులు అలా అలా స్వర్గధామాన్ని చేతికందించి నంత ఆనందం అనుభవించింది తను. ఆహా! ఎంతటి ఆనందం అది?

ఛీ! తనకి సిగ్గు లేదూ? పుస్తకాల్లో అనేక బొమ్మలు చూస్తాం. ఎంత బాగున్నదాన్నయినా కొన్ని క్షణాలు చూసి పేజీలు తిప్పివేయటం లేదూ? అలాగే ఈ ఫోటోనికూడా తీసి పారవేయకూడదూ? అంతే చేయాలి! కాని . . .

ఒక కాకి గంతులు వేస్తూ గుమ్మం వరకూ వచ్చి గదిలోకి తొంగిచూసింది. ఆమె దాని ప్రయత్నాన్ని ఆటంకపరచకపోవటం మూలాన, అది గదిలోకి ఒక్క గంతువేసి వెంటనే తన సాహసానికి తనే ఆశ్చర్యపడి, భయం పుట్టి ఎగిరిపోయింది.

నిద్ర పోతున్న పాపమీదకు వెళ్లాయి నాగమణి కళ్ళు. ఎందు కంత ధైర్యం చేసింది తను? ఎక్కడినుండి వచ్చింది తనకా సాహసం? తమ వంశగౌరవం, తలిదండ్రులకు కలగబోయే తలవంపు, చెల్లెళ్ల పెళ్లిళ్ళు—ఈ

సమస్యలన్ని ఆ నాడు తన బుర్రలో పరిగెట్టక పోలేదు. అయితే కలవకన్నెను ఆకరించే చంద్రునిలాంటి ఆ ముఖం, తన హృదయాన్నే వశపరచుకున్న ఆ కళ్ళు— వీటి ఆజ్ఞముందు ఆ సమస్యలన్నీ దూదిపింజల్లా తేలిపోయాయి. అంతే!

ఆ అర్ధరాత్రివేళ తను ఊహించుకున్న భావి స్వర్గానికి నాయకునితో ప్రయాణమయివచ్చిం దీ ఊరు, అతని అభిమాన కుసుమం—ఎర్రగులాబీగా. తరవాత తమ ఇద్దరి బంధుత్వాన్ని న్యాయబద్ధంచేసిన ఆ నాటి ప్రజ, అల గుళ్ళో కొలువు తీరిన వేణుగోపాల స్వామి ఈనాటికే సాక్షులుగా తమ జీవితాలను చూస్తున్నారు. కాని , . .

నాగమణి కళ్ళు మూసుకుంది నీరసంగా. మరి. . .? ఎర్రగులాబీ వాడిపోయిందికదూ? లేదు. వాడిపోలేదు. అతను శిరస్సున ధరించే అర్హతను పోగొట్టుకున్నాడు. వివేకశూన్యుడై విదిల్చించి పారేశాడు. ఆ ఎర్రగులాబీ తను నిర్మించుకున్న మెట్లమీదుగా స్వర్గాని కెగబ్రాకి, స్వర్గసుఖాల్ని కైవసం చేసుకోబోతూండగా వీచిన గాలి తాకిడికి ఎక్కిన మెట్లన్నీ ఒకటొకటిగా దిగే సమయం లేక, కాలు జారి పాతాళానికి పడింది. కాని అక్కడి పరిమళం కొంత, స్మృతులు కొన్ని తనతో తెచ్చుకుంది. తనక్కడ స్వర్గంలో గడిపిన రోజులు ఎప్పుడూ మరపురాకుండా ఉయ్యాలలోని పాపని మరోసారి చూసింది నాగమణి. అక్కడి పరిమళం!

* * *

దీపం పెట్టి పాపకి పాలుపట్టి పడుకోపెట్టింది నాగమణి. ఉయ్యాలలో అమాయికంగా నిద్రపోతున్న ఆ పాపముఖం చూడగానే జాలివేసింది. తలవంచి ముద్దు పెట్టుకుంది. చిన్న లేతపెదవుల్ని, నిద్ర పోతున్న పిల్లల్ని ముద్దు పెట్టుకోకూడదంటారు. కాని అందులో ఆనందం, తృప్తి ఉన్నప్పుడు ఎందుకు మానెయ్యా లా పని? ఆదినుండి అది తన మతంలోనే లేదు. అందుకే అనుభవిస్తూందేమో ఈనాడు!

వెన్నెల గడపమీద పడుతూంది. పక్కఇంటి నాయుడు తల్లి ఏడేళ్ల క్రితం పోయిన చిన్నకొడుకుని తలుచుకుని శోకన్నాలు పెడుతూంది. గొంతులో స్వరాలని కలగా పులగం చేస్తూ దూరంగా బండి బసవయ్య వెన్నెల ననుభవిస్తూ జానపదగీతం ఆలాపన చేస్తున్నాడు. పిత కొనని కాపురముంటున్న మంగలి మంగయ్య ప్రసారం చేసే సన్నాయి స్వరానికి, అతని క్షయరోగపు భార్య దగ్గు వంత పలుకుతూంది.

నాగమణి మిషను ముందు కూర్చుని ఏవేవో ఆలోచిస్తూ మెల్లిగా జాకెట్టు కుడుతూంది. ఆ మిషనుశబ్దం పాపాయికి జోలపాటలా ఉందేమో!

'ఎంత జాగ్రత్తగా పహరా ఇస్తున్నా ఎలా ప్రవేశిస్తా యీ ఆలోచనలు తన బుర్రలో? ఛీ! గతం నన్నిక వదిలిపెట్టేది లేదా? అసలు ఈ పటం తీసేస్తే ఈ ఆలోచనలేవీ రావేమో!' ఆ ఫోటోమీద ఎక్కడలేని ద్వేషం కలిగిం దామెకు ఆ క్షణంలో. కాని తనవితాను సంబాళించుకుంది. 'ఈ రెండేళ్ల శిక్షలోనూ తనా నరకంనుండి ఇదివరకటి స్వర్గానికి జేరుకోలేక పోయినా, మధ్యనున్న ఈ లోకంలో ఆవాసం కల్పించుకోగలిగింది. కాని ఆ పటంలోని ముఖం మాత్రం దిగజారిపోతూంది నానాటికే నరకంలోకి, పాతాళంలోకి! అతనికి ప్రాప్తించిన ఈ పరిస్థితే చాలు తనకి శాంతి, సంతృప్తులు కలిగించటానికి! ఉండనీ! ఉంటేమాత్రం తన నా ఫోటో ఏం చేయగలదు?'

అలవాటు చొప్పున చేతులు అప్రయత్నంగానే జాకెట్టు ముక్కల్ని కలుపుతున్నాయి. మిషను కుట్టుకు పోతూంది.

ఒక్కసారిగా కుట్టుపని ఆపి, చెవి ఒగ్గి వింది నాగమణి. దూరంగా సన్నగా వినిపించే కేకలు దేనినో తరుముతున్నట్లున్నాయి. మునసబుగారి ఆంబోతు విషయంలో త నిలాంటి కేకలు ఎన్నోసార్లు వింది. ఆ గోల, కేకలు దగ్గిరవుతున్నకొద్దీ, హోరులాంటి గోల పోయి మధ్య మధ్య మాటలేవో వినిపిస్తున్నాయి.

"తన్ను! తగల్సి! ఇంకోటిచ్చుకో! మరొకటి! ఇప్పు డెలా ఉందిరా సరసం?"

ఆ మూకంతా తనున్న వీధిలోకే వస్తున్నట్లుంది.

అలా అనుకోవడమే తడవుగా తారాజువ్వలా ఒక వ్యక్తి ఆమె గదిలో ప్రవేశించి తలుపు వేసుకున్నాడు. తన కళ్లను తనే నమ్మలేక పోయింది నాగమణి. అతను!

"ఇప్పుడు కావలిసి వచ్చిందిరా పెళ్ళాం! ఇన్నాళ్ళా పాపం, ఆ మహాఇల్లాలు ఏమయిపోయిందో గురువుగారి కక్కర్లేకపోయింది!" "దుమ్ము లిరగ్గొడతాం బైటికి రారా! తాగి తందనాలాడితే. . ." "ఏమిటయింది? ఏమిటయింది?" "కిష్టారావు మాష్టార్లేవే! తాగేసి ఆడాళ్లని అల్లరి పెట్టాడట! ఓ యబ్బో! ఆడికెంత పొగరనుకున్నావు?" "ఉంచుకున్న గైరి ఏటయినాది?" "ఈ పెళ్ళామయింది, గౌరయింది, ఇప్పు డింకొకత్తె!" "హరి రంగా! కలికాలం ఏం తగలబడి పోతూందిరా?"

నాగమణి కొయ్యలా నిలబడి పోయింది. ఇప్పుడు ఆ బైటికేకలు ఆమె చెవికి సోకటం లేదు. ఎదురుగా ఉన్న మనిషిని రెప్పలార్చకుండా చూస్తున్నా యామె కళ్లు. అతను వేసుకున్న చొక్కా చిరిగిపోయింది. ఆ చిరుగుల్లోంచి కనిపిస్తూంది కర్రదెబ్బలతో తట్లు తేలిన అతని ఒళ్లు! తల పగిలిందో ఏమోగాని నుదురుమీదుగా బొట్లుబొట్లుగా కారుతూంది రక్తం. గదిఅంతా గుప్పుమంటూ సారావాసన!

ఆమె దృష్టి అనుకోకుండా కుడిచేతిమీది వల్లటి మచ్చమీదికి వెళ్లింది. గాయం మానాక మిగిలిన తట్టు అది! అలాంటివెన్నో ఒంటినిండా! నిజంగా తను ఎంతటి స్వర్గానందా న్ననుభవించింది!

ఒక చిరునవ్వు తృప్తిగా ఆమె పెదవుల్ని వదిలింది. కాని మరుక్షణంలోనే ముఖం తీవ్రంగా మారి పోయింది. ఆమె పెదవులు ఆవేశంతో వణుకుతున్నాయి. ఆమె కళ్ళు నీళ్లని నింపుకున్నాయి, తన మీద తనకు కలిగిన జాలివల్ల. పాప కడుపులో ఉండగా, పెరట్లో ఉన్న నూతిదగ్గిరనించి ఇంట్లోదాకా జుత్తు పట్టుకుని ఈడ్చి, గొడ్డును బాదినట్లు వెదురుబద్దతో కొట్టినప్పుడు తన పరిస్థితి! అతని కాళ్ళు పట్టుకుంది. అతనికి కావలసిన విధంగా ప్రమాణం చేస్తానంది. లేని పోని అనుమానాలు పెట్టుకుని తన నిలా చిత్రహించ చెయ్యద్దని వేడుకుంది. ఆఖరికింక బాధ సహించలేక "మీ అనుమానాలు మీరే ఉంచుకొని, తోటిమనిషి ననయినా జాలిదలిచి వదిలి పెట్టు" మంది. ఆ నాడు తన మొర ఎంతవరకూ అతని చెవిని పడింది?

పోనీ, ఆ నాటితోనయినా ఆ నరకయాతనలనుండి విముక్తి దొరికిందనుకుంది నాగమణి. మళ్లీ అత నీ ఇంటిగుమ్మం తొక్కలేదు. ఒకవేళ వచ్చినా అతని ముఖంమీదే తలుపు వేసి ఉండేది తను! ఇవాళ! త నా రోజు ఏ స్థితిలో ఉందో, అదే స్థితిలో అత నివాళ! ఒంటినిండా తట్లు! తలమీద గాయం! కళ్లు ఆమెకు తెలియకుండానే తృప్తిగా మూసుకున్నాయి. మరు క్షణమే విప్పుకుని తేలికగా చూశాయి, మంచంమీద స్మారకం లేకుండా పడిఉన్న ఆ శరీరాన్ని.

ఆమె ముఖంలో ఏమాత్రం ఆత్రత లేదు. ఇప్పుడు తన కర్తవ్యమేమిటి? ఒక మూలగా నీళ్లకుండ మీద మూతవేసిన మూకుడుమీద గ్లాసు బోర్లించి ఉంది. తన నా రోజు ఆ స్థితిలో వదిలి పెట్టి వెళ్లి పోయారు, దిక్కూమొక్కూ లేకుండా, గాలికి ఎండ



## గాంధీజీ సూక్తులు

### బ్రహ్మచర్య నిర్వచనం

మనసా వాచా కర్మలద్వారా సాగే ఇంద్రియ నిగ్రహమే బ్రహ్మచర్యం. భౌతికంగా పవిత్రుడుగా ఉండి, మనోవికారాలకు లొంగిన వ్యక్తి సత్య బ్రహ్మచారి కాజాలడు.

(ఇది గాంధీజీ శతజయంతి సంవత్సరం)

పోయినా నీళ్ళుపోసేవాళ్ళుకూడా లేకుండా! అన్నా డతనికి సహాయపడాలా? అది తన ధర్మమా?

ఉయ్యాలలోని పాపముఖం అమాయికంగా కవిపిం చింది. ఆ పాపతోపాటు అంతులేని సంతృప్తి నిచ్చి నందుకయినా అతన్ని ఆదుకోవాలా? ముఖం పక్కకు తిప్పుకుంది. తన పుట్టింట్లో పాలరాతి బుద్ధుని విగ్రహం ఎందుకో గుర్తుకు వచ్చింది. దానిముందు ఒళ్లో కూర్చోపెట్టుకుని నాన్న చెప్పిన కథలు జ్ఞాపకానికి వచ్చాయి. ప్రశాంతమైన ముఖం, దయాదాక్షిణ్యాలు మూర్తీభవించిన కళ్ళు ఏవేవో హెచ్చరించాయి.

కాళ్లు ముందుకు పోగాయి. గ్లాసుతో నీళ్ళు తీసుకుని మంచాన్ని సమీపించిం దామె. అనుభవం నేర్పిన పాఠాలను వల్లెవేసుకునే మనస్సు కీడును హెచ్చరిస్తూంది. 'పాముకు పాలు పోస్తున్నా' వంటూంది. కాని కొంగు తడిపి రక్తాన్ని తుడిచి కట్టు కడుతూంది నాగమణి. ఇది తన కర్తవ్యమా? కాదని గుండెలోతు ల్లోంచి ఏదో ప్రబోధిస్తూంది. పాపముఖం తలపుకు వచ్చింది. ఇద్దరి కళ్ళూ ఒకటే! ఎంత ఆకర్షణ వాటిలో?

వీథిలోని మనుష్యులు ఇచ్చిన శిక్ష చాలనుకున్నారో, నాగమణి ముఖం చూసి ఊరుకున్నారో తెలియదు గాని ఎవరి దారిన వాళ్లు వెళ్ళిపోయారు. కోలాహలం అంతా తగ్గిపోయి, అలికిడి ఎక్కడా లేదు. కాని దూరంగా వీథిచుక్కలు మాత్రం ఉండి ఉండి మెరుగుతున్నాయి.

మూలుగు వినిపించి దాహంగా ఉన్నదేమోనని నీళ్ళు పట్టింది. కాస్త సేదదీరి నిద్రపోయినట్లుగా భావించుకుంది నాగమణి.

అర్ధరాత్రి అయింది. నాగమణి కుట్టుపని చూసు కుంటూనే ఉంది. ఆమెకు నిద్ర రావటం లేదు. ఎందుకని? అతనంటే ప్రేమా?

అతను మెల్లిగా కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు. ఆమెను చూసి ఏదో గుర్తుకు వచ్చినట్లు లేవబోయాడు. కాని కీళ్ళు బాధపెట్టాయి. మంచంమీదనే సగం లేచిన స్థితిలోఉన్న అతనిమీద నాగమణి చూపులు పడ్డాయి. వెంటనే అతను మరింత బలం తెచ్చుకుని ఒక్క ఊపున లేచి నిల్చున్నాడు. కాని కాళ్ళు వణుకుతున్నాయి. నిలదొక్కుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

కుట్టుపని ఆపి లేచింది నాగమణి. "పడుకోండి!"

అంత బాధలో ఉన్నా కంచుగంటలా మోగిం దతని గొంతు. "పడుకోను!"

ఎందుకో తెలియదు గాని అతను లోగడ చెప్పిన సంగతి ఒకటి గుర్తుకు వచ్చింది! ఒకవాడు తనతోకూడా ఒక అతిథిని తీసుకువచ్చా రీయన. ఆయనకి సలభై ఏళ్లదాకా ఉండవచ్చు! కాని ఆయన కింకా పెళ్లి కాలేదని చెప్పినప్పుడు మాత్రం తను వింతగా ఆశ్చర్యపోయింది. ఆయన రూపం మాత్రం ముమ్మూర్తులా ఈయన్నే పోలి ఉండటంతో ఈయనకి మేనమామ పోలికలు అచ్చు గుద్దినట్లు వచ్చాయనుకొంది తను. . . . ఆయన ఉన్న ఒక్క రోజులోనే కనిపెట్టిందిగా తను, 'ఈయనకి మాట తూంకారంలోకూడా ఆయన పోలికే వచ్చిం' దని!

నాగమణి ఆశ్చర్యపోలే దా జవాబుకు. "ఎందుకని?"

"పొరపాటయింది ఇక్కడికి రావటం!"




చిత్రం—ఎస్. వి. అంజన్‌బాబు (హైదరాబాదు)

"అంటే?"

"ఇటువంటి పొరపాట్లు ఇకమీద జరగకుండా ఉండాలనే జాగ్రత్త పడుతున్నాను."

"మీరు చెప్పేది నా కేమీ అర్థం కావటం లేదు."

"అంతేలే! మా మేనమామ నొకసారి నీకు చూపించాను కదూ? నన్నుకూడా అక్కడికే వచ్చి అతనితో ఉండమన్నాడు. ఇక నీ ముఖం చూడవలసిన అవసరం లేకుండా అక్కడికే వెళ్లిపోతాను. అసలు నీ కీ విషయం చెప్పకూడదనుకున్నాను. కాని!"

## కుమార్తెలు

తండ్రులు కుమార్తెల గొప్ప దనా లెన్నుతారు. తల్లులు కుమా రుల గొప్ప లెక్కువగా చెప్పుకుం టారు.

—మినాండర్

• • •

## ప్రార్థన

నా ప్రార్థనలకన్నింటికి ప్రతి ఫలితం రాలేదని భగవంతునికి కృతజ్ఞత తెలియజేసుకోడానికే నేను జీవించి ఉన్నాను.

—జీన్ ఇంగ్లో

ఉయ్యాలలో పాప మరో పక్కకు ఒత్తిగిలింది.

"అలాగే! మీ ఇష్టం వచ్చినట్లే చేద్దురు గాని!. . . కాని ఆ ముద్దులొలికే పాపని ఒక్కసారి చూసి, తరవాత. . ." నాగమణికి మరి మాట పెగలలేదు,

అతని ముఖంమీద హేళనగా నవ్వు మెరిసింది. కుంటుతూ, నడుస్తూ ఉయ్యాలను సమీపించాడు. పాపముఖం చూశాడు. ఏదో తెలియని కర్కశత్వం ఆవహించిం దతని గొంతును. "నీ పాప కదూ?"

"నీ పాప!" ఇదే ప్రశ్న ఆమె చెవులలో మారుమ్రో గింది.. చేతులతో చెవులు కప్పుకుని, కళ్లు రెండూ మూసుకుం దామె.

వీథితలుపు చప్పుడవటంతో అటువక్కకి తిరిగి చూసింది నాగమణి. అతనప్పుడే కుంటుకుంటూ వీథిలోకి అడుగు పెడుతున్నాడు.

బయట వెన్నెల ఎప్పుడో పోయినట్లుంది. ఇప్పు డంతా చిమ్మచీకటి. కీచురాళ్ల శబ్దం తప్ప మరేమీ వినబడటం లేదు.

"మీరు వెళ్లేది ఏ ఊరండీ?" ఆత్రంగా గుమ్మం వరకు పరుగెత్తి వచ్చి అడిగింది నాగమణి.

"ఏం? నువ్వుకూడా వస్తావా? నువ్వు రాలేవులే నాకు తెలుసు! చాలా దూరం పోతున్నాను. మళ్లీ నీ కెప్పుడూ కనిపించనులే!" అంటూ నాగమణి చూస్తున్న దనుకునే ఆకాశం వైపు కుడిచేతిని ఎత్తి చూపాడు. కాని ఆ చిమ్మచీకట్లో ఆమె కదేమీ కనిపించలేదు.

"కని పెంచినదానవు నువ్వు. అందుకే 'నీ పాప' అన్నాను. ఆ పాపమీద నా కేమి అధికారం ఉంది? అందుచేతే వెళ్లిపోతున్నాను!"

వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్లిపోయా డతను. ★